క్లుప్తంగా

సబ్సిడీ చెక్కుల పంపిణీ

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పీఏసీఎస్ ద్వారా రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 15 మంది రైతులకు సబ్సిడీగా ఇచ్చిన రూ.10,69,400ల చెక్కులను సొసైటీ చైర్‌పర్సన్ కైల శ్రీవల్లి మంగళవారం అందజేశారు. ఈ సొసైటీ ద్వారా 2018లో డీడీఎస్, డీఈడీఎస్ రూ.33.60 లక్షలు రుణాలుగా తీసుకుని సకాలంలో చెల్లించడంతో చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్ వెలగం శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆర్థిక సాయం



నిడుమోలు(మొవ్వ)/పామర్రు: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఓ తోటి విద్యార్థి కుటుంబానికి విద్యార్థులు, పాఠశాల విద్యా కుటుంబం సేకరించిన రూ.26,786 నగదును మంగళవారం అందజేశారు. గత నెల 25వ తేదీన మొవ్వ మండలం నిడుమోలు లాకు వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో జురుఘువరంలోని ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న కె.లోహిత్ నాగషణ్ముఖ్ ఇళ్లు అగ్నికి ఆహుతైంది. తమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సేకరించిన మొత్తాన్ని ప్రిన్స్‌పాల్ ఎండీ రఫీ విద్యార్థులతో కలిసి నగదు అందజేశారు. పాఠశాల యాజమాన్యం లోహిత్‌కు పుస్తకాలను ఇచ్చి తమ ఉదారతను చాటుకుంది.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ కుసుమకుమారి కోరారు. రొయ్యూరుకు చెందిన సంఘ సేవకుడు సూరి పవన్‌కుమార్ రూ.40 వేల విలువైన 25 కుర్చీలు, ఇనుప బీరువాను తహసీల్దార్ కార్యాలయానికి వితరణగా మంగళవారం అందజేశారు. పవన్‌కుమార్‌ను తహసీల్దార్ అభినందించారు. బీసీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు, సాయికాంత్, రంజిత్, నాగబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లిరూరల్: యువతి అదృశ్యంపై ఆమె తల్లి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. గుడివాడలో డిగ్రీ చదువుతున్న 19 ఏళ్ల యువతి ఆదివారం నుంచి కనిపించటంలేదంటూ ఆమె తల్లి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. బంధువుల ఇంట్లో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



పామర్రు: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీలలో రాష్ట్ర మహాసభలను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఈ సభల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పామర్రు తాలూకా యూనిట్ పరిధిలోని ఎన్జీవో సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడలో నిర్వహిస్తున్న ఈ మహాసభల్లో భవిష్యత్ ప్రణాళికలపై చర్చించి ఆమోదిస్తామన్నారు. నాయకులు ఏ వెంకటేశ్వరరావు, శోభన్ బాబు, ప్రకాష్, నగేష్‌బాబు, రాము, రాజేశ్వరి, కోటిరెడ్డి, ప్రేమ్ రాజు, కుమార్, కళ్యాణ్, శ్యామ్, సోమశేఖర్, సభ్యులు, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పమిడిముక్కల పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డు



పమిడిముక్కల: ఉత్తమ సేవలతో పమిడిముక్కల పీఏసీఎస్ జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. ఆప్కాబ్ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ సొసైటీలను ఎంపిక చేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన వజ్రోత్సవ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి చేతుల మీదుగా సంఘ అధ్యక్షులు మైనేని కోటేశ్వరరావు అవార్డు, ప్రశంసాపత్రం అందుకొన్నారు. పమిడిముక్కల పీఏసీఎస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కోటేశ్వరరావు, సిబ్బందిని రైతులు అభినందించారు. రైతులు, సిబ్బంది సహకారంతో సొసైటీని ప్రగతి పథంలో నడిపిస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఉండ్రపూడిలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఉండ్రపూడి(పామర్రు): రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి రావర్ల సచివాలయం పరిధిలోని ఉండ్రపూడి, పోలవరం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాల బ్రోచర్లను అందించి వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి ప్రభుత్వం మంచి చేస్తేనే మరలా ఆదరించాలని, మంచి చేస్తున్న ప్రభుత్వం మీద ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతీ గ్రామానికి వెళ్లి ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఆ నిధులతో గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.

పార్టీలకతీతంగా పథకాలు

కుల, మత, ప్రాంత, పార్టీ విభేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే కైలే అన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన ఉచితంగా అందజేశామని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. మాట ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని ప్రజలు విశ్వసించారని, రానున్న కాలంలో మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, కె.సుబ్బారావు, ఉండ్రపూడి పీఏసీఎస్ అధ్యక్షురాలు మురాల వెంకట కుమారి, గ్రామ పార్టీ కన్వీనర్ మురాల రెడ్డిబాబు, సర్పంచ్‌లు తోట పోలాక్షి, మట్టా శ్రీలక్ష్మి, కె.చంద్రశేఖర్‌రావు, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, మద్దుల సుబ్రహ్మణ్యం, బి.అప్పిరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, తోట రాంబాబు, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు



గోగం సురేష్, ఎంపీపీ

పెదపారుపూడి: మండలంలో తాను ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తాను పదవి చేపట్టిన ఏడాదిన్నర కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్లు, బోర్లు, వివిధ పనులు చేపట్టామన్నారు. రూ.40 లక్షల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. మండలంలో పెదపారుపూడి నుంచి యలమర్రు వరకు రూ.కోట్ల నిధులతో రోడ్డు పూర్తి చేయటం, పెదపారుపూడి నుంచి దోసపాడు వరకు రూ.1.80 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేశామని చెప్పారు. కొత్తగా వానపాముల నుంచి దోసపాడు వరకు 13 కిలో మీటర్ల వరకు రూ.60.60 కోట్లతో నిర్మాణ పనులకు అక్షన్ తీసుకుని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. యలమర్రు నుంచి పెదమద్దాలి మీదుగా పామర్రు వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అభివృద్ధి చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుంది.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి చేయడంతో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. దీంతో ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మేము చేసిన అభివృద్ధి చూసే ప్రజలు మరోసారి 40 వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించటం ఖాయమని జోస్యం చెప్పారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

11 మందికి స్కూటీల అందజేత



స్కూటీని అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పఠాన్ ముంతాజ్, ప్రజాప్రతినిధులు

పామర్రు: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 11 మంది దివ్యాంగులకు త్రి మోటారు సైకిళ్లను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు సమాజంలో గుర్తింపు తీసుకువచ్చి, వారి కాళ్లపై వారు నిలబడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. దివ్యాంగులకు అన్ని రంగాల్లో మంచి అవకాశాలను కల్పిస్తూ, వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్, జెడ్పీటీసీలు కె.స్వరూపరాణి, రాజులపాటి పార్వతి, మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నడకుదురు రాజేంద్ర, శొంఠి వెంకటేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, మర్రెడ్డి శేషురెడ్డి, తాడిశెట్టి శ్రీనివాసరావు, ఆవుల ప్రవీణ్, నందిరాజు, పెయ్యల రాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

నిభానుపూడి(పామర్రు): దమ్ము ట్రాక్టర్ తిరగబడి ప్రాణాలు కోల్పోయిన మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. నిభానుపూడి గ్రామానికి చెందిన ఎండీ ఇనయ్‌తుల్లా(36) దమ్ము చక్రాల ట్రాక్టర్ తిరగబడి సోమవారం మృతి చెందారు. మృతుడి పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం త్వరితగతిన వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిగురుపాటి మురళీ, అయూబ్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు పల్లికొండ రత్నకుమారి, తాడిశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

మండల వీఆర్‌ఏల కార్యవర్గం ఎన్నిక



తహసీల్దార్ నాగభూషణంకు ఎన్నిక పత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు, చుక్కమ్మ

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో మండల వీఆర్‌ఏల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. ఎన్నికను జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జువ్వనపూడి నాగేశ్వరరావు సమక్షంలో నిర్వహించారు. మండల వీఆర్‌ఏ సంఘ అధ్యక్షురాలుగా పుసునూరి చుక్కమ్మ(పెదపారుపూడి), ప్రధాన కార్యదర్శిగా యడావల్లి కరిముల్లా (సోమార్పాడు), కోశాధికారి నామేశ్వరరావు(వెంట్రప్రగడ)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చుక్కమ్మ మాట్లాడుతూ.. వీఆర్‌ఏల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాన్నారు. అనంతరం తహసీల్దార్ వి.నాగభూషణంకు నూతన కమిటీ ఎన్నికైన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్‌ఏలు పాల్గొన్నారు.

•వానరాల విహారం



కృష్ణా జిల్లా తోట్లవల్లూరు కరకట్టపై మంగళవారం వానరాలు గుంపులు గుంపులుగా విహారం చేశాయి. వానరాలు పిల్లలను తీసుకుని ఆహారం కోసం సంచరిస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు విజయవాడలో మహాధర్నా

పామర్రు: ప్రధాని మోదీని గద్దె దించాలి.. దేశాన్ని కాపాడాలి అనే నినాదంతో ఈనెల 9వ తేదీన విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ 9 ఏళ్ల మోదీ పాలనలో స్కీం వర్కర్లతో సహా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు, వర్కర్లను పర్మినెంట్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సీఐటీయూ నాయకులు, స్కీం వర్కర్లు, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు

మండవల్లి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించాలని ఎంపీడీవో సీకే వెంకటరమణ తెలిపారు. ప్రజల్లో దేశభక్తిని పెంచి, వారిని ఉత్తేజపరిచే విధంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం, వీరులకు వందనం – నేల తల్లికి నమస్కారం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో మండల పరిధిలోని ప్రజాప్రతినిధులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి

ముదినేపల్లిరూరల్: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు మెనూ సక్రమంగా అమలుచేయాలని ఎంఈవో కె.నరేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోషకాహార లోప నివరణకు ప్రభుత్వం మెనూ ప్రవేశపెట్టిందన్నారు. మెనూ సక్రమంగా అమలు చేస్తేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇంగ్లిష్, గణితం వంటి సబ్జెక్టులపై విద్యార్థులకు భయం లేకుండా సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్ పాఠశాల ప్రగతి గురించి వివరించారు. ఎంఈవో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులను అభినందించారు.


విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి

కైకలూరు: వసతి గృహాల్లో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని పట్టణ సీఐ ఆకుల రఘు చెప్పారు. కైకలూరు బీసీ కాలేజీ హాస్టల్ బాలికలకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కేవలం తల్లిదండ్రులు మాత్రమే వచ్చినప్పుడు విద్యార్థులను పంపించాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేసిన, ఆకతాయిలు వెంటపడి వేధించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆపద సమయంలో 100, దిశ టోల్ ఫ్రీలకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ శాఖ తనిఖీలు

పామర్రు: పామర్రు మండల పరిధిలో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిలో మచిలీపట్నం మైనింగ్‌శాఖ అధికారులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో వే బిల్స్ లేని నాలుగు గ్రావెల్ టిప్పర్లను సీజ్ చేసి, పామర్రు పోలీస్ స్టేషన్‌కు స్వాధీన పర్చారు. మైనింగ్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తనిఖీలో మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియోలజిస్ట్ టి.కొండారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, సర్వేయర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ వినియోగదారులకు జరిమానా



కైకలూరులో తనిఖీ చేస్తున్న విద్యుత్‌శాఖ ఏఈలు

కైకలూరు: పరిమితికి మించి అదనపు విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులపై విజిలెన్స్ సిబ్బంది కొరడా ఝుళిపించారు. కైకలూరు టౌన్ సెక్షన్‌లో విద్యుత్ వినియోగదారులు గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ మీటర్లను విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 51 బృందాలుగా ఏర్పడి 2,233 గృహ సర్వీసులు, 294 వాణిజ్య సముదాయాలు, 191 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 202 సర్వీసులకు అదనపు లోడు 294 కిలో వాట్స్ మొత్తానికి రూ.7,49,672 విధించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 94408 12362, 94408 12363, 83310 14951కు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో గుడివాడ ఈఈ టి.రామకృష్ణ, కైకలూరు డీఈఈ బి.రామయ్య, కైకలూరు టౌన్ ఏఈ కె.శ్రీనివాస మూర్తి, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: చిన్న చిన్న సాంకేతిక సమస్యల కారణంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధికారులకు సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వివిధ సమస్యలను మంగళవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వైద్య సేవల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించాలని, భూసర్వేలో నెంబర్‌లు కనిపించలేదంటూ సర్వే ఆపారని, గ్రామంలో రోడ్లు నిర్మించాలని తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలు సచివాలయాలు



మండవల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ వెంకటరమణ, ఎమ్మెల్యే డీఎన్నార్, నేతలు

మండవల్లి: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండవల్లిలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించి, శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ సీఎం తన సుదీర్ఘ పాదయాత్రలో పరిస్థితులు క్షుణ్ణంగా పరిశీలించి, గ్రామంలోని సమస్యలు అక్కడే పరిష్కరించే విధంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఈ వ్యవస్థకు ఆయువు పట్టు వంటి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు దేవునితో సమానమని పేర్కొన్నారు. ఆయన కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సీఎం ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దండే పుష్పలత, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ అగస్టీ ఆదివిష్ణు, బేతపూడి యేసోబురాజు, చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, బలే నాగరాజు, ఉప సర్పంచ్ జొన్నలగడ్డ నాగలక్ష్మి, బొమ్మనబోయిన గోకర్ణ, మెండా సురేష్, మంగర మల్లికార్జునరావు, గుడివాడ మురళి, పెరుమాళ్ల సత్యనారాయణ, గుడివాడ తమ్మిస్వామి, తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో సీకే వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో పద్మావతి

గుడివాడటౌన్: పట్టణంలోని బూత్ లెవల్ ఆఫీసర్స్ నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో పి.పద్మావతి కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. అందుకు పార్టీ కార్యకర్తల ద్వారా బీఎల్‌వోలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరణించిన వారి ఓట్లను తొలగిస్తామన్నారు. అన్ని పార్టీలు సహకరిస్తే లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాదు, వీరిశెట్టి నరసింహారావు, ఇతర నాయకులు దింట్యాల రాంబాబు, రమేష్, ఆర్‌సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు కలిగి ఉండాలి

గుడివాడటౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని ఆర్డీవో పద్మావతి తెలిపారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 72వ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి యువతరం ఓటు దేశ ప్రగతికి మెట్టు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యువతకు సమాజంపై అవగాహన పెరుగుతుందన్నారు. ఓటు ఒక వజ్రాయుధం వంటిదన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు అంగీకార పత్రాల అందజేత



లబ్ధిదారులకు అంగీకార పత్రాలు, తాళాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

గుడివాడటౌన్: మల్లాయిపాలెం లే అవుట్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయానికి సంబంధించి 395 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలు, అంగీకార పత్రాలు అందజేశామని అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో మంగళవారం వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకల సౌకర్యాలతో ఇళ్లను నిర్మించి లబ్ధిదారుని సమక్షంలో వసతులన్నీ పరీక్షించామన్నారు. లబ్ధిదారుడు సంతృప్తి చెందాక తాళాలు ఇచ్చామని చెప్పారు. అన్ని వసతులు ఉన్నందున వెంటనే లబ్ధిదారుడు నివాసం ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మీకుమారి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, కేబుల్ శ్రీను, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రీ సర్వే వెంటనే పూర్తి చేయాలి

ఆర్డీవో విజయకుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో విజయకుమార్

చినముత్తేవి(మొవ్వ): మండల పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా పొలాల రీ సర్వే కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.విజయకుమార్ ఆదేశించారు. మండలంలోని చినముత్తేవి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆర్డీవో మండల తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 11 గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించగా అవిరుపూడి, బార్లపూడి మాత్రమే పూర్తయ్యిందన్నారు. పెడసనగల్లు, అయ్యంకి, చినముత్తేవి, పెదముత్తేవి, గూడపాడు, కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, పాలంకిపాడు గ్రామాల్లో రీ సర్వే కొనసాగకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు వెంటనే రీ సర్వే పూర్తి చేయాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. తహసీల్దార్, మండల సర్వేయర్ ఏ.కిషోర్, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, డీటీ సీహెచ్ గోపాలరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యపై నివేదిక కోరిన కలెక్టర్

తోట్లవల్లూరు: కుమ్మమూరు శ్మశానవాటిక సమస్యపై కలెక్టర్ పి.రాజాబాబు ఉయ్యూరు ఆర్డీవో, తోట్లవల్లూరు తహసీల్దార్‌ను నివేదిక కోరినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శ్మశానవాటిక లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ నివేదిక కోరినట్లు శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.